క్లుప్తంగా

21 నుంచి రీ సర్వే గ్రామసభలు

కపిలేశ్వరపురం: భూసర్వే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు శనివారం తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అనుబంధ శాఖల అధికారులతో ఐదు బృందాలుగా ఏర్పడి గ్రామసభలో సేవలందిస్తారన్నారు. ల్యాండ్ రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని గ్రామసభల్లో భూ సమస్యలు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, జాయింట్ ఎల్‌పీఎంలు, ఖాతా నంబరు తప్పులు, మ్యుటేషన్ల సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఈ నెల 21న వల్లూరు, 22న నేలటూరు, 23న పడమర ఖండ్రిక, 24న నిడసనమెట్ట, 25న వడ్లమూరు, 26న వెదురుమూడి, 28న నల్లూరు, 2న వాకతిప్ప, 30న అంగర, నవంబర్ 1న కోరుమిల్లి, 2న కపిలేశ్వరపురం, 4న తాతపూడి 5న మాచర గ్రామాల్లో భూ యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తహసీల్దార్ వివరించారు.

మినీ గోకులం షెడ్డుకు శంకుస్థాపన

కపిలేశ్వరపురం: మండలంలోని వడ్లమూరులో మినీ గోకులం పథకం ద్వారా మంజూరైన నిధులతో పశువుల షెడ్డు నిర్మాణ పనులకు ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు శనివారం శంకుస్థాపన చేశారు. పాడి పరిశ్రమాభివృద్ధిలో భాగంగా నిర్మించే పశువుల షెడ్డుతో రైతులకు మేలు జరుగుతుందని మధు అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

22 నుంచి ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 22 నుంచి ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 22, 23 తేదీల్లో తాతపూడి, కోరుమిల్లి, వడ్లమూరు గ్రామాల సచివాలయాల్లోనూ, 24, 25 తేదీల్లో పడమరఖండ్రిక, కాలేరు, నేలటూరు గ్రామాల సచివాలయాల్లోనూ ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఆయా శిబిరాల్లో కపిలేశ్వరపురం, టేకి, వల్లూరు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, ఫణీంద్ర, కోరా దొరబాబు సేవలందిస్తారన్నారు. ఆధార్ నూతన నమోదు ప్రక్రియతో పాటు ఇప్పటికే ఆధార్ ఉన్నవారి వేలిముద్రలు, అడ్రస్, చిరునామా తదితర వివరాలను నవీకరించుకోవచ్చన్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు శిబిరాల్లోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.


వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెల పంపిణీ



ఆదర్శ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థలో అన్నదానం చేస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

కపిలేశ్వరపురం/మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మండపేట పట్టణం, రూరల్ గ్రామాలు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండపేట 7వ వార్డులోని ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థలో చైర్‌పర్సన్ దుర్గారాణి అన్నదానం చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు శాకా సత్యనారాయణ, తణుకు అశోక్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక మయూరి వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు, రూరల్ గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజీపీగా కమలకుమారి



లకాని పద్మ కమలకుమారి

రామచంద్రపురం: ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సీనియర్ అడ్వకేట్ లకాని పద్మ కమలకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ మహేష్‌కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు కమలకుమారి శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. కమలకుమారి 2012లో ఏజీపీగా సేవలందించారు. ప్రస్తుతం తిరిగి రెండోసారి ఏజీపీగా నియమితులయ్యారు. గతంలో బార్ అసోసియేషన్ మెంబర్ గా కాంగ్రెస్ పార్టీ నాయకురాలిగా, టెలికం అడ్వైజరీ మెంబర్ మున్సిపల్ కౌన్సిలర్‌గాను, కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాల ట్రస్ట్ మెంబర్‌గాను వివిధ హోదాల్లో సేవలందించారు. ఏజీపీగా సేవలు అందించేందుకు సహకరించి తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏజీపీగా ఉత్తర్వులు అందుకున్న కమలకుమారిని పలువురు రాజకీయ ప్రముఖులు, న్యాయవాదులు అభినందించారు.

అన్నదాత గుండెల్లో ఆందోళన

- గింజ గట్టిపడే దశలో వరి పంట
- వర్షాలు, మబ్బులతో కలవర పెడుతున్న వాతావరణం
- తడిసి మోపుడవుతున్న పెట్టుబడి



గింజ గట్టిపడే దశలో నేలకొరిగిన వరిపైరు

రాయవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే తరుణంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు అన్నదాతను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా వరి పంట నేలనంటుతోంది. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తడిసి మోపుడయ్యే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు.

1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేపట్టారు. జూలై మాసాంతానికి నియోజకవర్గంలో వరినాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం అధిక శాతం విస్తీర్ణంలో వరి పంట ఈనిక దశలో ఉంది. ముందుగా వరినాట్లు వేసిన పొలాల్లో వరి గింజ గట్టిపడే దశకు చేరుకుంది. ఇప్పటికే రబీ విత్తనాల కోసం సాగు చేసిన పొలాల్లో రైతులు కోతలు కూడా చేపట్టారు. వరి పంటను ఎండాకు తెగులు, మాగుడు తెగుళ్లు ఆశించడంతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టే పనిలో ఉన్నారు. ఎలుకలు చేసిన నష్టంతో పాటు తెగుళ్ల బెడద అధికంగా ఉండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఈ తరుణంలో కురుస్తున్న అకాల వర్షాలు రైతుల వెన్ను విరిచే ప్రమాదముంది.

ఆందోళనలో రైతులు

ఖరీఫ్ పనులు ముమ్మరం అవుతున్న దశలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈశాన్య రుతు పవనాలు ప్రవేశించినట్టు వాతావరణ శాఖ తెలియజేసింది. దీనికి తోడు బంగాళాఖాతంలో ఈ నెల 22న మరో వాయుగుండం ఏర్పడనున్నట్టు వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పదే పదే ఆకాశం వైపు, పంట వైపు చూస్తున్నారు. మూడు రోజులుగా రాత్రి సమయాల్లో వర్షం కురుస్తుండడంతో పాటు పగలు సమయంలో ఆకాశం మేఘావృతమై ఉంటోంది. పంట చివరి దశలో వర్షాలు కురిస్తే నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కోత దశకు చేరుకుంటున్నాయి



ముందుగా ఊడ్చిన వరి చేలు కోత దశకు చేరుకుంటున్నాయి. ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాల్లో పంట గింజ గట్టి పడే దశలో ఉంది. ఈ సమయంలో తుపాన్ హెచ్చరికలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.

– వెలగల భాస్కరరెడ్డి, రైతు, వి.సావరం, రాయవరం మండలం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణంలో వచ్చిన మార్పులు పంటను దెబ్బ తీస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరిగింది. ఇప్పటికే ఎలుకల కారణంగా దిగుబడులపై ప్రభావం చూపనుంది. ఈ పరిస్థితుల్లో వర్షాలు మరింత దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కౌలు రైతు, పసలపూడి, రాయవరం మండలం

అందుబాటులో ఉంటాం



ఖరీఫ్ వరిసాగు ఇంచుమించుగా చివరి దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు కలవరపడుతున్నారు. అయినప్పటికీ రైతులకు వ్యవసాయ శాఖ నిత్యం అందుబాటులో ఉంటాం. రైతులకు వ్యవసాయ శాఖ నిత్యం అందుబాటులో ఉంటుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



జగన్నాథగిరి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

కాజులూరు: సమగ్ర భూ సర్వేపై మండల గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. జగన్నాథగిరిలో తొలి గ్రామసభను శనివారం మండల తహసీల్దార్ శివకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో గత ఏడాది రెవెన్యూ సిబ్బంది సమగ్ర భూ సర్వేపై నిర్వహించారన్నారు. దీనిపై నవంబర్ 19వ తేదీ వరకూ మండలంలో రోజుకు ఒక్క గ్రామం చొప్పున గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి పేర్ల నమోదు తదితర అంశాలపై అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకుని సరిచేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వి.వేగేశ్వరరావు వీఆర్వో ఈశ్వరరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

కాలేరు రెవెన్యూ సదస్సులో 23 అర్జీలు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరులో శనివారం నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో వివిధ భూ సమస్యలపై 23 దరఖాస్తులు అందాయి. ఉన్నతాధికారుల ఆదేశాలపై తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ వీఆర్వో సత్యనారాయణతో పాటు సమీప గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. వివిధ భూ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. గ్రామ సభలో గ్రామ ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, భూయజమానులు పాల్గొన్నారు.

మండపేటలో దివ్యాంగులకు ఆదర్శ వివాహం



కులాంతర వివాహం చేసుకున్న దివ్యాంగులను ఆశీర్వదిస్తున్న పెద్దలు

మండపేట: వేర్వేరు కులాలకు చెందిన పట్టణంలోని ఇద్దరు దివ్యాంగులు ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నాయకులు సంయుక్తంగా ఈ జంటకు వివాహం జరిపించారు. కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన బీసీ అయిన వేముల ప్రసాద్ (32), కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన ఎస్సీ అయిన లంక మంగమ్మ (31)లకు రెండేళ్ల క్రితం పరిచయమైంది. కొంత కాలం తర్వాత వివాహం చేసుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అందుకు మంగమ్మ ఇంట్లో తల్లిదండ్రులు అంగీకరించలేదు. దాంతో వారిద్దరూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు, వీహెచ్‌పీఎస్ నాయకుడు షేక్ నబీలను ఆశ్రయించారు. ఇరివురు నాయకులూ ప్రసాద్ తల్లితో మాట్లాడి వారి వివాహానికి ఒప్పించారు. శనివారం మండపేట సంఘం కాలనీ చర్చిలో పాస్టర్ గాబ్రియేల్ దివ్యాంగులు ఇద్దరికీ ఘనంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కులాంతర వివాహాలను ప్రోత్సహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల మేరకు వీరిద్దరినీ ఇష్టపూర్వకంగా వివాహం జరిపించామన్నారు. ఆదర్శ వివాహం చేసుకున్న జంటకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దలు గాలింకి నాగేశ్వరరావు, మోరంపూడి సూరిబాబు, బెవర తాతారావు, కాకర కృష్ణమూర్తి, ఎస్.శ్రీను, విజయ్, భవాని, చిట్టెమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కబడ్డీ పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆదికవి నన్నయ అంతర్ విశ్వవిద్యాలయం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు కూడా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ మాట్లాడుతూ మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొట్టమొదటిసారిగా అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఆర్గనైజింగ్ డైరెక్టర్ వీరాంజనేయులు మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలకు 16 కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో మారేడబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బీవీ నరసింహరాజు, డాక్టర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, కే ప్రభాకరరావు, కళాశాలల వ్యాయామ అధ్యాపకులు ఆనంద్, దిలీప్, చంటి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో వైభవంగా గౌరీదేవి ప్రతిష్ఠ



గౌరీదేవి ప్రతిమగా వరిదుబ్బును ప్రతిష్ఠించేందుకు ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

రాయవరం: స్థానిక బసవ దేవుని గుడి వద్ద మేళతాళాల మధ్య గౌరీదేవిని శనివారం ప్రతిష్ఠించారు. జయశంకర చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో, యూత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. దేవాంగుల ఆడ పడుచుగా భావించే గౌరీదేవికి ప్రతిరూపంగా భావించే వరి దుబ్బుకు మూడేళ్లకు ఒకసారి పూజలు నిర్వహించి ప్రతిష్ఠించడం ఆనవాయితీ. పదేళ్ల లోపు వయసున్న బాలికతో వరి దుబ్బుకు పూజలు నిర్వహిస్తారు. నవంబరు 6న ఉత్సవం నిర్వహించేందుకు వారం రోజుల ముందుగా విభూతి పండు రూపంలో బసవదేవుడ్ని తీసుకువస్తారు. నవంబరు 11న ఉత్సవం అనంతరం వారిద్దరినీ తిరిగి సాగనంపుతారు. అందులో భాగంగా భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద వరిదుబ్బుకు ఆండ్ర వీరసాత్విక అనే బాలికతో పూజలు చేయించారు. వీరముష్టిలు పూజలు నిర్వహించిన అనంతరం బిందెలో ఉంచిన వరి దుబ్బును బాలికతో ఊరేగించిన అనంతరం బసవదేవుడి గుడి ఎదురుగా నూతనంగా, తాత్కాలికంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆండ్ర సుకుమార్, గంగాభవాని దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

మండపేట: ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు ద్వారా పలు ప్రజోపయోగ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవస్థాపకుడు సత్తి బులిస్వామి రెడ్డి సేవలు అభినందనీయమని యూనియన్ బ్యాంక్ రాయవరం శాఖ మేనేజర్ దాసరి ప్రదీప్ అన్నారు. శనివారం అర్తమూరులోని ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం డాక్టర్ అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాల వైద్య బృందం రోగులకు వైద్యసేవలు అందించారు. డాక్టర్ సుమమాధురి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం హోమియో వైద్యం ద్వారానే సాధ్యపడుతుందన్నారు. హోమియో వైద్యులు పి.కేజియా, జి. శృతి, కాత్యాయని, సీహెచ్ కీర్తిప్రియ, శ్యాంప్రసాద్, నాగరాజులు శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 270 మందికి వైద్య సేవలు అందుకున్నట్టు నిర్వాహకుడు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని హసన్‌బాదలో శనివారం ఉపాధి హామీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు నేతృత్వంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం శంకుస్థాపన చేశారు. ఉపాధి నిధులతో రూ.3 లక్షల విలువైన సిమెంటు రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ఎంపీటీసీ యర్రం దేవి, ఉప సర్పంచ్ నీలం భవాని, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, పంచాయతీ రాజ్ ఏఈ ఏసురత్నం కూటమి నాయకులు పాల్గొన్నా రు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎంపీడీవో కీర్తిస్పందన భూమిపూజ చేశారు. ఈ గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల వద్ద రూ.5 లక్షలతో నిర్మించే ఆర్వో ప్లాంట్‌కు, అలాగే పిల్లి వెంకటరమణకు చెందిన గోకులం షెడ్‌కు ఎంపీడీవో కీర్తిస్పందన భూమిపూజ చేశారు. గ్రామంలో రూ.17 లక్షలతో తొమ్మిది గోకులం షెడ్లు నిర్మించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె



రాయవరంలో కాలువ గట్టున వరిదుబ్బుకు పూజలు చేస్తున్న మహిళలు



కోలంకలో పంటకాలువ వద్ద గౌరీదేవికి, వరి దుబ్బుకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



టేకిలో తద్దె పూజలు చేస్తున్న మహిళలు



రామచంద్రపురంలోని కొత్తూరులో పంటకాలువ వద్ద పూజలు చేస్తున్న మహిళలు

రాయవరం: అట్లతద్దోయ్...ఆరట్లోయ్, ముద్ద పప్పోయ్...మూడట్లోయ్ అంటూ మహిళలు శనివారం అట్లతద్దె పండగను సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువనే మహిళలు స్నానమాచరించి వ్రతాన్ని ప్రారంభించారు. కొత్తగా వివాహమైన వధువులు మధ్యాహ్నం వేళ 11 రకాల ఫలాలు, అట్లతో మంచంపై పెట్టి 11 మంది ముత్తయిదువలకు వాయనాలను 'ఇస్తినమ్మా వాయనం...తీసుకుంటినమ్మా వాయనం' అంటూ వాయనాలు అందజేశారు. సాయంత్రం మహిళలంతా కాలువ గట్టు వద్దకు చేరి వరి దుబ్బులకు పూజలు చేసి, గౌరీదేవి పాటలు పాడారు. అధిక సంఖ్యలో మహిళలు సమీపంలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయడంతో పలు దేవాలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం చంద్రుడ్ని చూసిన అనంతరం మహిళలు ఉపవాస దీక్షను విరమించారు. మండలంలోని వెదురుపాక, రాయవరం, వి.సావరం, నదురుబాద, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో అట్లతద్ది సందడి ఇంటింటా కన్పించింది.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శనివారం అట్లతద్దె సందడి నెలకొంది. పసుపు కుంకుమలు చల్లగా ఉండాలని, పాడిపంటలు కలగాలంటూ తద్దె పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో చేశారు. నోము నోచుకుని ముత్తదువలకు వాయనాలు అందజేశారు. పుణ్య స్నాన ఘట్టాలు, గౌతమి గోదావరి పుష్కర ఘాట్‌లు వద్ద దీపారాధన చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని నది, కాలువలు సందడిగా మారాయి.

రామచంద్రపురం: అట్లతదియని మహిళలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసంతో ఉండి సాయంత్రం వేళలో గంగమ్మ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కొత్తూరు రోడ్డులోని పంట కాలువ వద్ద, వెల్ల రోడ్డులోని శాంతినగర్‌లోని పంట కాలువ వద్దకు పెద్ద ఎత్తున మహిళలు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో శనివారం అట్లతదియని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళల్లో పంట కాలువల వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి పూజలు చేశారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో శనివారం అట్లతదియను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి రాత్రి నక్షత్ర దర్శనంతో ఉపవాస దీక్ష ముగించారు. కాలువల వద్దకు వెళ్లి గౌరీదేవికి, గంగాదేవికి పూజలు నిర్వహించారు. పంటలు బాగుగా పండాలని కాలువ వద్ద వరి మొక్కలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయం సమయంలో పలువురు మహిళలు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మినపపిండి, బియ్యం పిండితో అట్లు వేసి మహిళలు పరస్పరం వాయనాలు ఇచ్చుకున్నారు. పలుచోట్ల వృద్ధులు, మహిళలకు చిన్నారులకు అట్లతదియ కథ వినిపించి పండుగ ఇతి వృత్తాంతాన్ని తెలిపారు.

'కృత్తివెంటి' విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

రామచంద్రపురం: కాకినాడ సెట్రాజ్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ యూత్ ఫెస్టివల్-24లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో వరుసగా లైవ్ ఇన్‌స్ట్రుమెంటల్స్‌తో ప్రదర్శించిన గ్రూప్ ఫోక్ డాన్స్‌కు ప్రథమస్థానం, గ్రూప్ ఫోక్ సాంగ్‌కి ప్రథమస్థానం, సోలో ఫోక్ సాంగ్‌కి ప్రథమ స్థానం, సోలో ఫోక్‌సాంగ్‌లో తృతీయ స్థానాల్లో నిలిచారని ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించి ప్రథమ ప్రయత్నంలో విద్యార్థులను విజేతలుగా నిలిచేటట్లు చేసిన, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సుజాతను అభినందించారు. ఇదే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తే తప్పకుండా రాష్ట్రస్థాయిలో కూడా విజేతలుగా నిలిచి కళాశాలకు మంచి పేరు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులకు, వీఏఏ, వీహెచ్ఏ రైతు సేవ కేంద్రం సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై ద్రాక్షారామ రైతు సేవ కేంద్రంలో ఏవో ఎన్.సత్యప్రసాద్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడీఏ ఎస్‌వీ రంగారావు పాల్గొని పంటపై వచ్చిన పంటపై వచ్చే తెగుళ్ల పురుగుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డీఆర్‌సీ ఏఓ మనోహర్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకి ఒకసారి పురుగులు, తెగుళ్ల సీఎల్‌సీ యాప్‌తో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు..

దేశం గర్వించదగ్గ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా



రతన్‌టాటాకు నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

రామచంద్రపురం: టాటా గ్రూప్ సంస్థల అధినేత రతన్ నోవెల్ టాటా మృతి దేశానికి తీరని లోటని, రామచంద్రపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ గన్నమని చక్రవర్తి ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు సంతాపం రతన్ టాటాకు లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రవర్తి మాట్లాడుతూ రవాణా రంగం పితామహుడు రతన్‌టాటా దేశంలో ప్రకృతి వైపరీత్యాలు వంటి ఆపద కాలంలో ఆదుకునే గొప్ప మనసున్న మహావ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది నిరుద్యోగుల పాలిట పేదల దైవ సంభూతుడు నోవెల్ రతన్ టాటా మరణం దేశానికీ, కార్మికులకు తీరని లోటన్నారు. రతన్ టాటా జీవితం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సమాజానికి అయన చేసిన సేవలను దేశంలో ఉన్నా దిగ్గజ పారిశ్రామిక వ్యక్తులతో పాటు, చిన్న చిన్న సంస్థల అధినేతలు రేపటి భారత్ దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్ నాయకులు, లారీ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.